మంత్రి సురేఖ సైకిల్ సవారీ



రామన్నపేట, కాశీబుగ్గ, న్యూస్‌టుడే: రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విద్యార్థి దశ రోజులను గుర్తు చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం వరంగల్ ఓసిటీలోని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆంధ్రా బాలిక ఉన్నత పాఠశాలకు చెందిన కొందరు విద్యార్థినులకు మంత్రి సురేఖ చేతుల మీదుగా కాంగ్రెస్ నాయకుడు మెడిపల్లి కృష్ణారెడ్డి సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థినులతో కలిసి క్యాంపు కార్యాలయం వద్ద సైకిల్ తొక్కి సందడి చేశారు. విద్యార్థినులతో స్వీయ చిత్రాలు దిగారు.

అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యం


వర్ధన్నపేట, న్యూస్‌టుడే: అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. వర్ధన్నపేట కోనారెడ్డి చెరువులో గురువారం చేపపిల్లలు వదిలారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 194 మంది గీత కార్మికులకు కాటమయ్య రక్ష కిట్లు అందజేశారు. కులవృత్తులకు జీవం పోసేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత పాలకులు ప్రచార ఆర్భాటం తప్ప గీతకార్మికులకు, మత్స్యకారులకు చేసిందేమీ లేదన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ అరుణ, తహసీల్దార్ విజయసాగర్, ఎంపీడీవో వెంకటరమణ, కాంగ్రెస్ పార్టీ నేతలు రాజిరెడ్డి, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, మైస సురేశ్, కాంగ్రెస్ మత్స్యకారుల విభాగం అధ్యక్షుడు సారంగపాణి, మత్స్యకారులు, గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



కోనారెడ్డి చెరువులో చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే నాగరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

దూది రైతుకు దుఃఖమే మిగిలింది!

ఈనాడు, వరంగల్, మహబూబాబాద్
ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే



'శుక్రవారం మార్కెట్‌లో వ్యాపారులంతా సిండికేట్ కావడంతో ధర పడిపోయింది. మద్దతు ధర రూ.7521 ఉండగా తేమ పేరుతో వ్యాపారులు రూ.1000 నుంచి రూ.1500 తగ్గించి కొనుగోలు చేశారు.'

రైతు ఆశాజీవి.. ఎప్పటికైనా గిట్టుబాటు ధర రాకపోతుందా అని ఆరుగాలం కష్టించి పంట పండిస్తే చివరికి కన్నీరే మిగులుతోంది. ఈసారి అకాల వర్షాలు, చీడపీడల కారణంగా.. ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. దానికితోడు పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడం లేదు. మార్కెట్‌లో దళారులు, అధికారులు కుమ్మక్కై ధర తగ్గించి రైతును నిలువునా ముంచుతున్నారు.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పత్తిని అధికంగా పండించే అన్నదాతల పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది.

● రాష్ట్రంలోనే పెద్దదైన వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా రైతులు పత్తిని అమ్మకానికి తీసుకొస్తారు. శుక్రవారం ధర పడిపోవడంతో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన నిర్వహించారు. పోలీసులు రంగప్రవేశం చేసి రైతులు, రైతు సంఘాలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, మార్కెట్ అధికారులతో చర్చించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని మార్కెట్ కార్యదర్శి రైతు సంఘాల నాయకులకు భరోసానివ్వడంతో.. ఆందోళన సద్దుమణిగింది. ఎలాంటి షరతులు లేకుండా సీసీఐ కొనుగోళ్లు చేపట్టాలని, మద్దతు ధర రూ.11 వేలకు పెంచాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

సీసీఐ ప్రేక్షక పాత్ర..

వ్యాపారుల చేతుల్లో రైతులు నిలువునా మోసపోతున్నా.. భారత పత్తి సంస్థ ప్రేక్షక పాత్ర పోషిస్తోంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పత్తిలో 8 నుంచి 12 తేమ శాతం రాదని తెలిసినా.. తేమశాతాన్ని పెంచేందుకు సీసీఐ నిబంధనలు ఒప్పుకోవని అధికారులు చేతులెత్తేశారు. దాంతో వ్యాపారులు రైతుల కష్టాన్ని అగ్గువకే దోచుకుంటున్నారు. మరోవైపు గ్రామాల్లోనూ దళారులు అక్రమంగా పత్తి కొనుగోళ్లు చేస్తూ.. తిరిగి మార్కెట్‌లో అదే పత్తిని ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు.



వేలం పాట నిర్వహిస్తున్న మార్కెట్ సిబ్బంది

మార్కెట్‌లో 'మద్దతు' కరవు

రూ.10 వేలకు అమ్మినా ఏమీ మిగలవు

- అడ్డాల కిషన్‌రావు, రైతు, రేపల్లె, దుగ్గొండి



నాకున్న రెండెకరాల్లో పత్తి వేశాను. శుక్రవారం 8 క్వింటాళ్ల వరకు పత్తి తీసుకువచ్చి క్వింటాకు రూ.6600 చెల్లించారు. ఎకరా పత్తి తీయిస్తే రూ.4 వేల వరకు ఖర్చయింది. నాలుగుసార్లు పురుగుమందులు, ఇతరత్రా ఖర్చులు కలిపి భారీగా ఖర్చయింది. క్వింటా పత్తి రూ.10 వేలకు అమ్మినా మాకు ఏమీ మిగలవు.

రవాణాకే రూ.5 వేలు చెల్లించాను

- రౌతు రాజయ్య, రైతు, కుంటపల్లి, సంగెం



మూడెకరాల్లో పత్తి వేస్తే తొలి కాపులో 15 క్వింటాళ్ల వరకు వచ్చింది. మార్కెట్‌కు తేవడానికి రూ.5 వేలు ఖర్చయింది. కూలీలు రూ.500 ఇస్తేగాని రావడం లేదు. ఇక్కడ రూ.6500 కంటే తక్కువకే అడుగుతున్నారు. గతేడాది రూ.7 వేలకు పైగా ధర వచ్చింది.

రైతుల ఇబ్బందులపై వివరణ కోరగా
● పత్తి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ సీసీఐ కనీస తేమ 15 నుంచి 20 శాతానికి పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశామని అన్నారు.
● ఎనుమాముల మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల మాట్లాడుతూ వ్యాపారులు తక్కువ ధరకు రైతుల నుంచి సరకును కొనకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

పంటను దున్నేస్తున్నారు..!

గత ఆగస్టు, సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాల ప్రభావం పత్తి రైతులను వెంటాడుతోంది. భారీ వర్షాల సమయంలో పత్తి పూత, పిందె రాలిపోయి తెగుళ్ల బారిన పడింది. చివరి ప్రయత్నంగా పురుగు మందులను పిచికారీ చేసినా ఫలితం లేకపోయింది.



● నర్సింహులపేట మండలం జగ్గుతండా గ్రామపంచాయతీ చింతతండాకు చెందిన రైతు బానోతు బాలాజీ మూడున్నర ఎకరాల్లో పత్తి వేశారు. రూ.లక్ష వరకు పెట్టుబడి వ్యయం చేయగా భారీ వర్షాలతో పూత, పిందెలు రాలిపోయాయి. ఎరువుల దుకాణదారుల సూచన మేరకు పలు రకాల పురుగు మందులు పిచికారీ చేసినా ఫలితం కనరాలేదు. పది క్వింటాళ్ల పత్తి మాత్రమే దిగుబడి వచ్చింది. పంటకు గులాబీ పురుగు ఆశించడంతో శుక్రవారం ట్రాక్టర్‌తో దున్నించి తొలగించారు.



● గోపాతండాకు చెందిన తాజా మాజీ సర్పంచి అజ్మీర లక్ష్మి రూ.60 వేల పెట్టుబడి పెట్టి రెండెకరాల్లో పత్తి సాగు చేశారు. భారీ వర్షాలకు పంట పూత, పిందెలు రాలిపోయి పెరుగుదల నిలిచిపోయింది. పురుగు మందులు వాడినా ఆరు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. తెగుళ్లు, వానరాల నుంచి కాపాడుకోలేక పంటను పశువులకు మేతకు వదిలేశారు..

–న్యూస్‌టుడే, నర్సింహులపేట

జిల్లాల వారీగా..	వరంగల్	జనగామ	భూపాలపల్లి	మహబూబాబాద్	హనుమకొండ	ములుగు	
	1,19,910	1,16,000	93,460	79,632	77,330	20,740	● ఎకరాలు
	7,19,460	6,96,000	5,60,760	4,77,792	4,63,980	1,24,441	● పత్తి దిగుబడి అంచనా (ఎకరానికి 6 క్వింటాళ్ల చొప్పున)

ఆసుపత్రుల్లో పరిస్థితులపై అధ్యయనం



ఎంజీఎం ఆసుపత్రిలోని డైట్‌లో ఆహార పదార్థాల తయారీ, నాణ్యత ప్రమాణాలను పరిశీలిస్తున్న డీఎంఈ కమిటీ సభ్యులు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్య సేవలు, వైద్యులు, సిబ్బంది, మందుల కొరత, పనితీరు ఇతర సమస్యలపై అధ్యయనం కోసం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) వేసిన కమిటీ సభ్యులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ కమిటీలో మహేశ్వర ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, అడిషనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి.నరేందర్, జనగామ ప్రభుత్వ వైద్యకళాశాల బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ సీవీ.శారద, సిద్దిపేట ప్రభుత్వ వైద్యశాల ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ విమల థామస్ ఉన్నారు. ముందుగా హనుమకొండలోని టీబీ ఆసుపత్రి, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, వరంగల్ ఎంజీఎం ఆసుపత్రితోపాటు కేఎంసీలోని సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిని పరిశీలించారు. వీరివెంట ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చిలుక మురళి, ఆర్ఎంవోలు డాక్టర్ కొడం మురళి, డాక్టర్ శశిధర్ ఉన్నారు. ఎంజీఎంలో రోగులు, వైద్యులకు పోషకాహారం తయారు చేసే(డైట్) వంటశాలను తనిఖీ చేసి పారిశుద్ధ్య నిర్వహణ, ఆహార నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. బయోవేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ తీరును పరిశీలించారు. పడకలు, మందుల నిల్వ, కొరత, వార్డులు, ఆసుపత్రి ఆవరణలో పారిశుద్ధ్య నిర్వహణ, సిబ్బంది పనితీరుపై రోగుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆసుపత్రికి కావాల్సిన మౌలిక వసతులు, సౌకర్యాలు, వైద్యపరికరాలు, అవసరమైన మరమ్మతులు వివరాలను తెలుసుకున్నారు. రోగులకు వైద్యసేవలతోపాటు, సౌకర్యాలు, తాగునీరు, రోగుల సహాయకులకు వసతి ఇతర సేవా లోపాలను నమోదు చేసుకున్నారు. ఆసుపత్రుల్లో గుర్తించిన అంశాలను డీఎంఈకి నివేదిక రూపంలో అందించి పరిష్కారానికి కృషిచేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

విధి నిర్వహణలో అలసత్వం సహించం



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా, వేదికపై డీసీపీలు షేక్ సలీమ, రాజమహేంద్రనాయక్, రవీందర్ అదనపు డీసీపీ రవి

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీసు అధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. శుక్రవారం కమిషనరేట్‌లో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఠాణాల వారీగా నమోదైన కేసులు, నిందితుల అరెస్టు, కేసు విచారణ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఠాణాల పరిధిలో జరిగే అన్ని కార్యక్రమాలపై ముందస్తు సమాచారం అధికారులు సేకరించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారమయ్యే కథనాలపై దృష్టి పెట్టాలని సూచించారు. వదంతులను వ్యాప్తి చేసే వ్యక్తులు, సంస్థలపై నిఘా పెంచాలన్నారు. ఎవరైనా బాధితులు కమిషనరేట్‌లో ఫిర్యాదు చేసినా వాటిని ఆయా ఠాణాలకు పంపిస్తున్నామని, వాటిపై సమగ్రంగా విచారణ చేయాలన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన టాస్క్‌ఫోర్స్ యాంటీ డ్రగ్స్ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బందికి రివార్డులను అందించారు. డీసీపీలు షేక్ సలీమ, రవీందర్, రాజమహేంద్రనాయక్, అదనపు డీసీపీ రవి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్ల బదిలీలు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: వరంగల్ పోలీసు కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్, సీసీఆర్‌బీలో పనిచేస్తున్న వారిని బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న శ్రవణ్‌కుమార్‌ను పాలకుర్తికి, భిక్షపతిని కొడకండ్లకు, సీసీఆర్‌బీ నుంచి టాస్క్‌ఫోర్స్ విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను బచ్చన్నపేటకు బదిలీ చేశారు.

కచ్చితత్వంతో పశుగణన ఉండాలి



గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న జిల్లా పాలనాధికారి డా.సత్యశారద, ఇతర అధికారులు

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని 13 మండలాలు 161 రెవెన్యూ గ్రామాలు, 70 మున్సిపల్ వార్డుల్లో శుక్రవారం నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు జాతీయ పశుగణన అత్యంత కచ్చితత్వంతో నిర్వహించాలని జిల్లా పాలనాధికారి డా.సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. అందుకోసం జిల్లాలో 58 మంది పశుగణనకర్తలు, 24 మంది పర్యవేక్షకులను నియమించినట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో పశుగణనకు సంబంధించిన గోడపత్రికను ఆమె ఆవిష్కరించారు. జిల్లాలోని 1,24,603 గ్రామీణ కుటుంబాలు, 1,17,982 కార్పొరేషన్, మున్సిపాలిటీల్లోని 17,936 కుటుంబాలను సర్వే చేయాలన్నారు. గేదెలు, ఆవులు, కోళ్లు, గొర్రెలు, మేకలు ఇలా 16 రకాల పశువులు, జీవాల సంఖ్యను లెక్కించి, ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదుచేయాలని వివరించారు. పశుగణన ఆధారంగా నిధులతోపాటు వ్యాధినిరోధక టీకాలు, నట్టల వ్యాధి నివారణ మందులు తదితరాలు సరఫరా అవుతాయన్నారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డా.బాలకృష్ణ, జిల్లా నోడల్ అధికారి బాలాజీ, పశువైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఎస్‌జీఎఫ్ఐ' ఎంపిక పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) అండర్-19 క్రీడా ఎంపిక పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నాలుగు రోజులపాటు జరిగే క్రీడా పోటీలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న జూనియర్ కళాశాలల క్రీడాకారులు హాజరయ్యారు. ముఖ్యఅతిథులుగా హనుమకొండ కలెక్టర్ ప్రావిణ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ. క్రీడల కోటాలో ఉన్నత చదువులు, ఉద్యోగావకాశాలు పొందవచ్చని తెలిపారు. క్రీడలతో నాయకత్వ లక్షణాలు ఏర్పడతాయని తెలిపారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ. విజయమే లక్ష్యంగా క్రీడాకారులు ఆడాలని, రాష్ట్ర, జాతీయస్థాయిలో జిల్లాకు పేరు తీసుకురావాలని సూచించారు. హనుమకొండకు చెందిన ఇరిగేసి అర్జున్ ప్రపంచ పోటీల్లో రాణిస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రూ.25 లక్షల నజరానా అందించారని గుర్తు చేశారు. అనంతరం కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్తేజ పరిచారు. ఈనెల 25, 26, 28, 29 తేదీల్లో క్రీడా పోటీలు ఉంటాయని హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి, ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, హనుమకొండ, వరంగల్ జిల్లాల ఇంటర్మీడియట్ అధికారులు గోపాల్‌రావు, శ్రీధర్, పీడీలు గోపీ, సతీష్, ప్రభాకర్, శ్యాంప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, లిల్లీఫ్లోరెన్స్, డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావిణ్య



కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

విలీన గ్రామాలపై వివక్ష తగదు



సమావేశంలో పాల్గొన్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, మేయర్ సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీతాలు తీసుకోవడం లేదా? ప్రజలు ఫోన్లు చేస్తుంటే ఎందుకు స్పందించరు?, విలీన గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు అధ్వానంగా ఉన్నాయి.. ఎన్నిసార్లు చెప్పినా తీరు మార్చుకోరా అంటూ వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్.నాగరాజు నగరపాలక సంస్థ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం బల్దియా సమావేశ మందిరంలో వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని 1, 2, 14, 43, 44, 45, 46, 55, 56, 64, 65, 66 డివిజన్లలో కొనసాగుతున్న పనులు, టెండర్లు, ప్రతిపాదనల్లో ఉన్న పనుల తాజా పురోగతి, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై రెండున్నర గంటల పాటు సమీక్ష సమావేశం జరిగింది. తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని, లీకేజీలు అరికట్టాలని, సమయపాలన పాటించాలని, ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చూడాలని ఎమ్మెల్యే నాగరాజు కోరారు. ఇంటింటా చెత్తసేకరణ రోజూ చేపట్టాలని, చెత్త తరలింపు, మురుగు కాలువల శుభ్రత పనులు చేయాలన్నారు. టెండర్లు పూర్తయిన పనులు ప్రారంభించాలని, ఉద్దేశపూర్వకంగా పనులు చేయని గుత్తేదారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ విలీన గ్రామాల్లో పట్టణ వాతావరణం కల్పించేందుకు కూడళ్లు, ప్రధాన రహదారుల్లో సెంట్రల్ డివైడర్లు, లైటింగ్, గ్రీనరీ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. స్థానిక కార్పొరేటర్లతో అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ వర్ధన్నపేట పరిధిలోని విలీన గ్రామాల్లో రూ.114 కోట్లతో 21 పనులు చేపట్టామని, 5 పూర్తయ్యాయని వివరించారు. సమావేశంలో అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి, ఎస్ఈ రాజయ్య, ముఖ్య ఆరోగ్యాధికారి డాక్టర్ రాజిరెడ్డి, సిటీప్లానర్ రవీందర్ రాడేకర్, ఉప కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్, 'కుడా' ఈఈ భీంరావు, టీఎస్పీడీసీఎల్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రూ.5 కే భోజనం..

ముక్కు మూసుకుంటేనే తినగలం!

వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లోని అన్నపూర్ణ భోజన పథకం పంపిణీ కేంద్రాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. కేంద్రాల వద్ద కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఏడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఇనుప డబ్బాలు పాడయ్యాయి. రూ.5 భోజనం పంపిణీ కేంద్రాలపై వరంగల్ మహా నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం అధికారుల పర్యవేక్షణ కరవైంది.
కార్పొరేషన్, న్యూస్‌టుడే



వరంగల్ బస్టాండ్ ఎదురుగా మురికి కూపం వద్ద కేంద్రం

వరంగల్ బస్టాండ్ ఆధునికీకరణ పేరుతో భోజనం కేంద్రాన్ని.. బస్టాండ్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలోకి మార్చారు. భోజనం అందించే డబ్బా చుట్టూ మురుగు నిలిచి.. దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మురుగునీరు నిలవడంతో దోమలు, ఈగలు ఎక్కువయ్యాయి. ఛీ.. ఛీ.. ఇదేం కంపు అంటూ ప్రజలు ఈసడించుకుంటున్నారు. దీనివల్ల చాలామంది కేంద్రాల వద్దకు రావడం లేదు. వచ్చినవారు వరంగల్ అండర్ బ్రిడ్జి కేంద్రం వద్ద రోడ్డు మీద, సమీపంలో ఉన్న దుకాణాల ముందు నిలబడి భోజనం చేస్తున్నారు. అనంతరం విస్తరాకులు, ఇతర వ్యర్థాలు ఆరుబయట విచ్చలవిడిగా పడేస్తున్నారు.

రోజూ 3500 మందికి పైగా..

వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో 13 అన్నపూర్ణ రూ.5 భోజనం కేంద్రాలు కొనసాగుతున్నాయి. కాజీపేట, హనుమకొండ, వరంగల్ త్రినగరాల్లోని ప్రధాన కూడళ్లలో వాటిని ఏర్పాటు చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతీ, యువకుల కోసం హనుమకొండ జిల్లా గ్రంథాలయం, వరంగల్ రంగంపేట ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం, వరంగల్ ఎల్లమ్మబజారు జిల్లా గ్రంథాలయం వద్ద అందుబాటులో ఉన్నాయి. ప్రతిరోజూ 3500 మందికి పైగా భోజనాలు చేస్తున్నారు.

● రూ.5 భోజన పథకం కోసం గ్రేటర్ వరంగల్ సాధారణ నిధుల (జనరల్‌ఫండ్స్) ద్వారా నెలకు సుమారు రూ.25-28 లక్షలు చెల్లిస్తున్నారు. మూడు నెలలకోసారి బిల్లులు ఇస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో ఖర్చవుతున్నా.. ప్రజారోగ్య విభాగం అధికారులు తనిఖీలు చేయడం లేదు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

- బి.రాజిరెడ్డి, ముఖ్య ఆరోగ్యాధికారి, గ్రేటర్ వరంగల్

వరంగల్ బస్టాండ్ ఎదురుగా ఉన్న భోజనం పంపిణీ కేంద్రాన్ని కొత్త స్థలంలోకి మార్చుతాం. అపరిశుభ్రతపై ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. మిగిలిన కేంద్రాల్లో వసతులు, సమస్యలపై.. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

వంతెన కూలింది.. కాలినడకే దిక్కైంది!



ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల రాకపోకలు మెరుగుపర్చేందుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి- పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామాల మధ్యలోని మానేరు వాగుపై నిర్మిస్తున్న వంతెన పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నిర్మాణ పనులు జరుగుతుండగానే ఈ ఏడాది ఏప్రిల్, జులైలో రెండుసార్లు వంతెన గడ్డర్లు కూలిపోయాయి. 2016లో రూ.51.60 కోట్లు మంజూరు కాగా.. అప్పటి నుంచి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ క్రమంలో గాలి దుమారానికి ఏప్రిల్‌లో 2-3 పియర్ల మధ్యలో 5 గడ్డర్లు, జులై 17-18 పియర్ల మధ్యలో 5 గడ్డర్లు కూలిపోయి ధ్వంసమయ్యాయి. అప్పటి నుంచి పనులు నిలిచిపోయాయి. దీంతో రెండువైపుల వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.. కూలీ పనులకు వెళ్లేవారు వాగు వరద ప్రవాహంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.. వెంటనే పనులు ప్రారంభించేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. –ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే టేకుమట్ల



వీరు పెద్దపల్లి జిల్లా ఓడేడు గ్రామానికి చెందిన కూలీలు. నిత్యం 500 మంది వరకు వాగులో నుంచి నడుచుకుంటూ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంకు కూలీ పనులకు వస్తుంటారు. వాగు ప్రవాహం పెరిగితే ఇరువైపుల కాలినడక రాకపోకలు సైతం నిలిచిపోతాయి..

ఈ ప్రయాణం ప్రమాదం



పత్తి పంట దిగుబడులు వస్తుండటంతో వ్యవసాయ కూలీలకు డిమాండ్ పెరిగింది. హనుమకొండ జిల్లా పరకాల నుంచి నిత్యం వందలాది మంది మహిళా కూలీలు ట్రాక్టర్లు, ఆటోల్లో ఇతర గ్రామాలకు వెళ్తున్నారు. వాహనాల్లో పరిమితికి మించి కూలీలను ఎక్కించుకొని తీసుకెళ్తున్నారు. పరకాలలోని వెల్లంపల్లి రోడ్డులో గురువారం కొందరు మహిళలు ఇలా ఆటో వెనుక భాగంలో నిలబడి ప్రమాదకరంగా ప్రయాణించారు. ప్రమాదం జరగకముందే పోలీసులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. – న్యూస్‌టుడే, పరకాల


నేడు ముదిరాజ్ కుల వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్




నర్సంపేట, న్యూస్‌టుడే: తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు' పెళ్లి పందిరి. నెట్ ముదిరాజ్ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని రెండు రోజులు నిర్వహిస్తోంది. నర్సంపేట కోర్టు హాలు వెనుక ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ వేదికగా ఈ కార్యక్రమం ఉంటుంది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు అక్టోబరు 26, 27 తేదీల్లో (శని, ఆదివారాల్లో) ఉదయం 9 సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవాలి. ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్‌లో యాప్ ద్వారా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయాల్సిన వధూవరుల బయోడెటా, ఫొటోలు 83744 45190, 80080 02165 వాట్సాప్ నెంబర్లకు పంపించాలి. మరిన్ని వివరాలకు ఆ నంబర్లలో సంప్రదించాలి.

కాళోజీ కళాక్షేత్రం

● అత్యాధునిక హంగులతో నిర్మాణం పూర్తి



రాష్ట్ర సాంస్కృతిక రాజధానిగా పేరొందిన ఓరుగల్లుకు గర్వకారణంగా నిలిచే కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఇది ఉమ్మడి వరంగల్‌కే తలమానికంగా నిలవనుంది. పలుకుబడుల కవితలతో ప్రజాకవిగా.. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి దాతగా పేరొందిన ఓరుగల్లు ముద్దుబిడ్డ కాళోజీ నారాయణరావు స్మారకార్థం హనుమకొండలోని హయగ్రీవాచారి మైదానంలో కళలకు నిలయంగా ఇది వెలుగొందనుంది. – న్యూస్‌టుడే, వరంగల్ సాంస్కృతికం



ఓరుగల్లుకు మణిహారం..

- మొత్తం విస్తీర్ణం: 4.2 ఎకరాలు
- నిర్మాణం: 4 అంతస్తులు
- మొత్తం భవన నిర్మాణం: 6172 చదరపు అడుగులు
- ప్రహరీతో పాటు గార్డెన్, పార్కింగ్ కలిపి: 95,548 చ.అ
- వ్యయం: రూ.95 కోట్లు



ఆడిటోరియంలో సభావేదిక, పైన విద్యుద్దీపాలు

ప్రాంగణం ఆహ్లాదకరంగా.. కళాక్షేత్రం ఆవరణలో ఆహ్లాదకరమైన గార్డెన్‌తో పాటు పార్కింగ్ సదుపాయం ఉంది. ఇందులో రకరకాల పూలు, అలంకరణ మొక్కలు నాటారు. లోపలికి వెళ్లగానే పచ్చని మొక్కలు స్వాగతం పలుకుతాయి. ప్రవేశమార్గంలో కాళోజీనారాయణ రావు విగ్రహం దర్శనమిస్తుంది.



రవీంద్రభారతికి దీటుగా : హైదరాబాద్ రవీంద్ర భారతికి దీటుగా ఆడిటోరియం ఉంటుంది. రవీంద్రభారతి ఆడిటోరియం సీటింగ్ సామర్థ్యం 980. అదే కళాక్షేత్రంలో 1127 కుర్చీలు ఏర్పాటు చేశారు. ఇందులో అప్పర్ బాల్కనీలో 286 మంది కూర్చోవచ్చు. మిగతావి వరుస క్రమంలో కింద భాగంలో ఉంటాయి. సినిమా టాకీసును మించిన ఆధునిక సదుపాయాలు కల్పించారు. ఆడిటోరియం లోపలికి వెళ్లగానే కళ్లు విప్పారుతాయి. సభావేదికపై కెనరా లైటింగ్స్ ఆడియో, వీడియో సెట్టింగ్స్ చేశారు. స్టేజి వెనుక, ఇరువైపులా బాలురు, బాలికల కోసం 4 గ్రీన్ రూమ్స్, అతిథులు, నిర్వహణ కోసం 12 గదులు ఉన్నాయి. ఒకేసారి 500 మందికి పైగా వేదికపై కూర్చునేలా భారీ వేదిక నిర్మించారు. ప్రవేశ మార్గంలో ఇరు వైపులా సువిశాలమైన కారిడార్స్ నిర్మించారు. నిరంతర విద్యుత్తు సరఫరా కోసం ఆధునిక జనరేటర్ ఏర్పాటు చేశారు. ఆడిటోరియం లోపలికి వెళ్లడం, బయటకు రావడానికి రెండు వైపులా కలిపి ఆరు తలుపులు ఉన్నాయి.






కాళోజీ జ్ఞాపకాలతో ఆర్ట్ గ్యాలరీ


కాళోజీ నారాయణరావు తొలి, మలి దశ ఉద్యమాల్లో పాల్గొన్న చిత్రాలు, ఆయన సాధించిన పురస్కారాలతో ప్రత్యేకంగా ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటు చేశారు. జిల్లాలోని కవులు, కళాకారులతో పాటు ప్రముఖుల చేతుల మీదుగా పొందిన పురస్కారాలు, సరదాగా ముచ్చటించిన అరుదైన చిత్రాలను ఇక్కడ చూడొచ్చు.



గ్రంథాలయం ఏర్పాటు చేయాలి..



కాళోజీ నారాయణరావు 1930 నుంచి గ్రంథాలయోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. తెలంగాణలోని ప్రతి గ్రామంలో గ్రంథాలయం ఉండాలనేది ఆయన ఆకాంక్ష. స్వరాష్ట్ర సాధన కోసం ఆయన అనేక పుస్తకాలు రచించారు. కవితలు, సూక్తులతో ప్రజలను చైతన్యపరిచారు. మరాఠీ, ఆంగ్లం, ఉర్దూ బాషల్లో పండితుడు. అనేక ఇతర భాషా గ్రంథాలను తెలుగులోకి అనువదించారు. నా భారతదేశ యాత్ర, పార్థివ వ్యయం, కాళోజీ కథలు, నా గొడవ, జీవనగీత, తుది విజయం మనది, తెలంగాణ ఉద్యమ కవితలు, ఇదీ నా గొడవ, బాపూ! బాపూ! బాపూ! లాంటి అనేక కవితా సంపుటాలు రచించారు. ఆయన రచనలతో కళాక్షేత్రంలో ప్రత్యేకంగా గ్రంథాలయం ఏర్పాటు చేస్తే భావి తరాలు వాటి గొప్పతనం తెలుసుకునే అవకాశం ఉంది.





విద్యుత్తు తీగలకు.. ఊతమైన కర్ర

జనగామ మండలం మరిగడి గ్రామంలో పలు చోట్ల వ్యవసాయ బావుల వద్ద విద్యుత్తు తీగలు తక్కువ ఎత్తులో యమపాశల్లా వేలాడుతున్నాయి. ప్రస్తుతం వరి కోతల సీజన్ కావడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు సంభవిస్తాయోనని రైతులు, వరి కోత యంత్రాల యజమానులు ఆందోళన చెందుతున్నారు. గానుగుపహాడ్-మరిగడి రహదారి పక్కన ఓ రైతు పొలంలో 11 కె.వి విద్యుత్తు తీగలు వేలాడుతుండగా, రైతు పైకి లేపేందుకు ఓ కర్రను ఏర్పాటు చేశారు ఇలా.. వర్షాలు కురిస్తే భూమికి ఎర్తింగ్ వచ్చే ప్రమాదం ఉంది. ఈ విషయమై ఎన్పీడీసీఎల్ జనగామ రూరల్ ఏఈ మధును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. వెంటనే మిడిల్ స్తంభాన్ని ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, జనగామ రూరల్

నిలిచిపోయిన గూడ్స్ రైలు

కేసముద్రం, న్యూస్‌టుడే: విజయవాడ - కాజీపేట మార్గంలో వెళ్తున్న ఓ గూడ్స్ రైలు ఓవర్‌హెడ్ ఎలక్ట్రిఫికేషన్ (ఓహెచ్‌ఈ)లో సాంకేతిక లోపం ఏర్పడి తాళ్లపూసపల్లి, కేసముద్రం రైల్వే స్టేషన్ల మధ్య 428 కి.మీ., వద్ద శుక్రవారం ఉదయం 8.15 గంటలకు నిలిచిపోయింది. రైల్వే అధికారులు మరో రైలు ఇంజిన్‌ను కేసముద్రం నుంచి తెప్పించి ఆగిన గూడ్స్‌కు అమర్చడంతో 9.20 గంటలకు కదిలింది. ఆ మార్గంలో వెళ్తున్న పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. మహబూబాబాద్‌లో కోర్బా ఎక్స్‌ప్రెస్, సింగరేణి, డోర్నకల్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైళ్లు సుమారు గంటపాటు నిలిచిపోయాయి.

ప్రజల అర్జీలు పరిశీలించిన మంత్రి సురేఖ



లేబర్‌కాలనీ, న్యూస్‌టుడే: వరంగల్ ఓసిటీలోని తన క్యాంపు కార్యాలయానికి రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం వచ్చారు. నగరంలోని పలు డివిజన్ల నుంచి నాయకులు, ప్రజలు తరలివచ్చి మంత్రికి విజ్ఞాపన పత్రాలు అందించారు. వరంగల్ వెంకట్రామా టాకీస్ సమీపంలోని శ్మశానవాటిక స్థలాన్ని కొందరు ఆక్రమించి భవనం కట్టి అద్దెకిచ్చారని మంత్రి దృష్టికి తెచ్చారు. కబ్జా అంశంపై వరంగల్ తహసీల్దారు ఎండీ ఇక్బాల్‌కు ఫోన్ చేసి మంత్రి ఫిర్యాదుకు సంబంధించిన అంశంపై తనకు పూర్తి వివరాలు కావాలని కోరారు. సమస్యల ఆధారంగా సంబంధిత అధికారులకు తగు ఆదేశాలిచ్చి అక్కడికక్కడే పరిష్కారానికి కృషి చేశారు.

హరిత పర్వతాలు.. పైన హిమాలయాలు...!





అక్కడి పరిసరాలన్నీ హరిత వర్ణంతో ముసుగేసినట్లు కనిపిస్తాయి. దేశ సరిహద్దుల్లో ఉన్న హిమాలయాలు లాగా హరిత కొండలు కనువిందు చేస్తాయి. ఆకాశం పైన ధవళ వర్ణంలో ఉన్న మేఘాలు మంచు కొండల్ని తలపిస్తున్నాయి. ధర్మసాగర్, వేలేరు, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల పరిధిలో విస్తరించిన ఇనుపరాతి గుట్టల ప్రకృతి రమణీయత కట్టిపడేస్తోంది. ఈత చెట్టును ఆవాసంగా మార్చుకుని ఉన్న గిజిగాని పక్షుల గూళ్లు ఆకాశంలో ఉన్న భ్రాంతి కలుగుతోంది. హనుమకొండ జిల్లా వేలేరు మండలం ఎర్రబెల్లి గ్రామ శివారులో తీసిన సుందర చిత్రాలు. – ఈనాడు, హనుమకొండ

చికెన్ ధరలు (వెన్‌కాబ్) (కిలో వెల రూపాయలలో)			
ఫాం:	115	డ్రెస్డ్:	199
రిటైల్:	137	స్కిన్‌లెస్:	226

కేఎంసీలో పరిశోధనోత్సవం ప్రారంభం



క్విజ్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య విద్యార్థులు



అస్థిపంజరంతో ఫొటో..



సీపీఆర్‌తో ప్రాణాలు నిలపడం ఎలానో వివరిస్తూ..

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: కాకతీయ వైద్య కళాశాల ఎన్ఆర్ఐ భవనంలో 'కాకతీయ రీసెర్చ్ ఇనిషియేటివ్ ఫర్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్నోవేషన్స్' (కృతి) రెండో పరిశోధనా దినోత్సవ సదస్సు శుక్రవారం మొదలైంది. రాష్ట్రంలోనే మొదటి సారి అండర్ గ్రాడ్యుయేట్, పీజీ విద్యార్థులను క్లినికల్ వైద్యంతోపాటు పరిశోధనల వైపు మళ్లించడానికి నిర్వహిస్తున్న ఈ సదస్సుకు రాష్ట్రం సహా, దేశం నలుమూలల నుంచి వచ్చిన వైద్యవిద్యార్థులు హాజరయ్యారు. కేఎంసీ యూఎస్‌ఏ అల్యుమిని, కాకతీయ రీసెర్చ్ ఇనిషియేటివ్ ఫర్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్నోవేషన్స్ కన్వీనర్ డాక్టర్ సుజిత్ ఆర్ పున్నం, డాక్టర్ వేణు జి.బత్తిని అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో మొదటిరోజు డిబేట్, హ్యాకథాన్, జెపార్టీ(ఇండియాలోనే అతిపెద్ద మెడ్ క్విజ్) పోటీలు నిర్వహించారు. వైద్యపరిశోధనకు ఉపయోగపడేలా ఆటపాటలతో కూడిన క్విజ్ పోటీలు ఆకట్టుకున్నాయి. ఎన్ఆర్ఐ భవనం ఆవరణలో ఏర్పాటుచేసిన స్టాళ్లలో జూనియర్ వైద్యవిద్యార్థులకు సీనియర్ విద్యార్థులు వైద్య అవగాహన కల్పించారు. ఇందులో శరీర నిర్మాణం, డయాలసిస్ ద్వారా కృత్రిమ రక్తశుద్ధి విధానం, గుండె పనితీరు. కార్డియాక్ అరెస్టు అయిన వ్యక్తిని పీసీఆర్ చేయడం ద్వారా ఎలా బతికించొచ్చు అనే అంశాలపై అవగాహన కల్పించారు. వైద్య పరికరాలు, విజ్ఞానానికి సంబంధించి ఏర్పాటుచేసిన స్టాళ్లలో వైద్య పదజాలంతో కూడిన ఆటలు నిర్వహించారు.



వివిధ స్టాళ్ల వద్ద విద్యార్థులు

కేయూ ఈఈఈ పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలిగా సుమలత



ఉప కులపతి నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న సుమలత

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ (ఈఈఈ) విభాగం నూతన పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలిగా సహ ఆచార్యులు సుమలత నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత అధ్యక్షులు కె.చీనా నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించి, ఈ పదవిలో రెండేళ్లపాటు కొనసాగుతారు. సుమలతకు 14 ఏళ్ల బోధనానుభవం ఉంది. ఎన్ఎస్ఎస్ అధికారిగా, హాస్టల్ అదనపు సంచాలకులుగా, ఈఈఈ విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వహించారు. ఉప కులపతి ఆచార్య కె.ప్రతాపరెడ్డి నుంచి ఆమె నియామక ఉత్తర్వులు అందుకున్నారు.

సైకిల్ సవారీ.. ఆరోగ్యమేమరి..



డిజిటల్ మీటర్



సైకిల్‌పై రయ్‌మంటూ వెళ్తున్న యువకుడు హనుమకొండలోని వికాస్‌నగర్‌కు చెందిన తోకల రాజురెడ్డి. తాను రోజూ భవన నిర్మాణ అవసరాల నిమిత్తం నగరంలో సైకిల్‌పైనే సుమారు 40 కిలోమీటర్లు తిరుగుతానని చెబుతున్నారు. దీనికి బ్యాటరీతో కూడిన మోటారు కూడా ఉండటంతో 15 కిలోమీటర్లు తొక్కుతూ.. మిగతాది బ్యాటరీ మోటారు ఆన్‌చేసి వెళ్తుంటానని తెలిపారు. ఒకసారి ఛార్జింగ్ చేస్తే 50 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేయొచ్చని చెప్పారు. సైకిల్‌కు ఏడు గేర్లు ఉంటాయని, హ్యాండిల్‌కు వేగాన్ని సూచించే డిజిటల్ మీటరు కూడా ఉంటుందన్నారు. ఇది వరకు తనకు బుల్లెట్ బండి ఉండేదని, దానికి ఇంధన ఖర్చు ఎక్కువ అవుతుండటంతో రెండు నెలల కిందట రూ.50 వేలు వెచ్చించి ఈ సైకిల్ కొన్నానని తెలిపారు. ప్రస్తుతం నెలకు సుమారు రూ.3 వేలకుపైగా ఆదా అవుతోందని, సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంగా ఉంటున్నానని ఉత్సాహంగా చెప్పారు. – ఈనాడు, హనుమకొండ

పరీక్ష రాశారు.. ప్రతిభ చాటారు



విజేతలతో ఉపాధ్యాయుడు క్రాంతికుమార్


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నర్సంపేట, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడం కోసం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 'ఈనాడు, ఈటీవీ తెలంగాణ' ఆధ్వర్యంలో నర్సంపేట మండలం లక్నేపల్లిలోని బిట్స్ పాఠశాలలో 8, 9, 10 తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించగా ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. హెచ్.అర్పిత (ప్రథమ), వి.సహస్రశ్రీ (ద్వితీయ), జి.ప్రహర్షిత (తృతీయ) స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు క్రాంతికుమార్, భవానిచంద్, పార్వతి పాల్గొన్నారు.

నలుగురు ఉపాధ్యాయుల సస్పెన్షన్

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: విద్యాశాఖ అనుమతులు లేకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నలుగురు ఉపాధ్యాయులను సస్పెన్షన్ చేసినట్లు డీఈవో జ్ఞానేశ్వర్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం వర్ధన్నపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు జరుగుతున్న సమయంలో కొంతమంది ఉపాధ్యాయులు ఎలాంటి సమాచారం లేకుండా గైర్హాజరు కావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు పి.రమణరావు, కె.రోహిణిదేవి, ఎల్.వంశీమోహన్, కె.ధనలక్ష్మిలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయాలి: సెలవు తీసుకుంటున్నట్లు ఉపాధ్యాయులు లేఖలు ఉన్నా వాటిలో సాంకేతిక తప్పులను ఎత్తి చూపుతూ నలుగురు ఉపాధ్యాయులను సస్పెన్షన్ చేయడం సరికాదని ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు ఆరోపించారు. జరిగిన దానిపై సంజాయిషీ కోరకుండా సస్పెండ్ చేయడం సరికాదన్నారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్పందనకు వందనం

మురుగు కాలువలు శుభ్రం

కొత్తవాడ, న్యూస్‌టుడే: గ్రేటర్ వరంగల్ 12వ డివిజన్ వీవర్స్ కాలనీలో మురుగు కాలువలు చెత్తతో నిండిపోయాయి. దుర్వాసనతో ఇబ్బందిపడుతున్నామని స్థానికులు తెలిపారు. ఈ సమస్యను మున్సిపల్ కార్పొరేషన్ శానిటరీ సూపర్‌వైజర్ పసునూరి భాస్కర్ దృష్టికి తీసుకెళ్లగా.. పారిశుద్ధ్య సిబ్బందితో కాలువలను శుభ్రం చేసి మురుగునీరు పోయేలా చేశారు.

అరుణాచలానికి ఆర్టీసీ బస్సు

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే: తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షిణకు హనుమకొండ బస్టాండు నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆర్టీసీ రీజియన్ మేనేజర్ డి.విజయభాను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 15న కార్తిక పౌర్ణమి సందర్భంగా జరిగే గిరి ప్రదక్షిణకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును వరంగల్-1 డిపో నుంచి ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 13న బస్సు బయలుదేరి కాణిపాకం, వెల్లూరు మీదుగా 14న సాయంత్రం 7గంటలకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. యాత్ర ప్యాకేజీ టికెట్ పెద్దలకు రూ.4,500, పిల్లలకు రూ.3 వేలుగా సంస్థ రుసుం నిర్ణయించిదన్నారు. ఆసక్తి ఉన్నవారు tsrtconline.inలో ముందస్తుగా రిజర్వేషన్ చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం 9959226056, 9494107944 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

6లోగా ఓటరు నమోదు

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఓటరుగా నవంబర్ 6లోగా ఫారం 19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పాలనాధికారి డా.సత్యశారద సూచించారు. వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయుల నియోజకవర్గ ఓటర్ల జాబితా తయారీలో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. నవంబర్ 23న ముసాయిదా ఓటరు జాబితా, డిసెంబర్ 9 వరకు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, డిసెంబర్ 30న తుదిజాబితా ప్రచురిస్తామన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైవిధ్య పోషకాహారంతోనే ఆరోగ్యం


వైద్య, అంగన్‌వాడీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ఆహారంలో వైవిధ్యత లేకపోవడం పిల్లలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని ఇక్కడ పోషకాహారం అందించడం తోపాటు లోపాలున్న వారికి చికిత్స అందించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో పర్యవేక్షించబడిన అనుబంధ ఆహార కార్యక్రమం(ఎస్ఎస్ఎఫ్‌పీ)పై జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఆర్‌బీఎస్‌కే పల్లె దవాఖానల వైద్యులు, ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు సంయుక్తంగా నిర్వహించిన సమన్వయ సమావేశంలో డీఎంహెచ్‌వో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పోషణ లోపాలకు గురైన పిల్లలను గుర్తించి ఆ పిల్లలకు అవసరమైన వైద్య చికిత్స అందించి వారి జాబితాను తప్పనిసరిగా ఎంసీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామీణ ఆరోగ్య పారిశుద్ధ్య దినోత్సవంలో ఆకలి పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు, పోషకాహార చికిత్స, లోప పోషణకు గురైన పిల్లల స్థితిగతులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి రాజమణి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి

సంగెం, న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన భోజనం అందించాలని లేనిక్రమంలో చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. శుక్రవారం మండలంలోని కాపులకనపర్తి, కొత్తగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను డీఈవో జ్ఞానేశ్వర్‌తో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. కాపులకనపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించకపోవడంపై నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల పెట్టె తరగతి గదిలో కాకుండా ప్రధానోపాధ్యాయురాలి గదిలో పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల పెట్టెను తెరిచి చూడగా "కూరలు బాగుంటే బడిలో తింటాం లేకుంటే ఇంటి వద్దే తింటామని" ఓ ఉత్తరం రాసి ఉండటంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులను వెంటనే తొలగించాలని, ప్రధానోపాధ్యాయురాలికి షోకాజు నోటీసు ఇవ్వాలని డీఈవోను ఆదేశించారు. తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంఈవో సుజన్‌తేజ పాల్గొన్నారు.

వర్ధన్నపేట: పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ, రెవెన్యూ అధికారులకు కలెక్టర్ డా.సత్యశారద తెలిపారు. వర్ధన్నపేట, ఇల్లంద, కట్ర్యాల ప్రభుత్వ పాఠశాలలను అందులోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాల్లో నెలకొన్న సమస్యలను స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులను నిలదీశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులను, చిన్నారులకు, బాలింతలకు అందజేసే ఆహారాన్ని పరిశీలించారు.

చోరీకి పాల్పడిన పుర సిబ్బందిపై వేటు

ఈనాడు కథనానికి స్పందన

నర్సంపేట, న్యూస్‌టుడే: నర్సంపేట ఫిల్టర్‌బెడ్ దగ్గరున్న గేట్‌వాల్వ్‌ను రాత్రివేళ ఎత్తుకెళ్లి తిరిగి అమర్చిన ఇద్దరు కింది స్థాయి సిబ్బందిపై మునిసిపల్ అధికారులు వేటు వేశారు. శుక్రవారం 'ఈనాడు'లో 'రాత్రి అపహరించారు..ఉదయం బిగించారు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఏఈ రాజేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, మంచినీటి విభాగం ఇన్‌ఛార్జి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ పిల్టర్‌బెడ్ వద్దకెళ్లి విచారణ జరిపారు. పురపాలక సంఘంలో పనిచేసే పవన్, రాహుల్ గేట్‌వాల్వ్‌ను ఎత్తుకెళ్లి తరువాత బిగించినట్లు తెలిపారు. వీరిని పది రోజులు విధుల నుంచి తొలగించి సంజాయిషీ తాఖీదులు జారీ చేసినట్లు ఏఈ రాజేశ్ తెలిపారు. పిల్టర్‌బెడ్ వద్ద విధులు నిర్వర్తించే రమేశ్, వేంకటేశ్వర్లు, రాజశేఖర్, మాషుక్‌లను రెండు రోజులు విధుల నుంచి పక్కన పెట్టినట్లు పేర్కొన్నారు.

ప్రమాదకరంగా గుంతలు.. పట్టించుకోని అధికారులు



జాన్‌పాక(గీసుకొండ), న్యూస్‌టుడే: వరంగల్- నర్సంపేట ప్రధాన రహదారిలో జాన్‌పాక సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఉన్న గుంతలు ప్రమాదకరంగా మారాయి. వేలాది వాహనాలతో రహదారి రద్దీగా ఉంటుంది. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్న అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు దృష్టిసారించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

10 కిలోల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ సీఐ పి.సురేందర్

గిర్మాజీపేట, న్యూస్‌టుడే: ఒడిశా రాష్ట్రం బ్రహ్మపూర్ నుంచి ముంబైకి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని వరంగల్ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సీఐ పి.సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు గురువారం రాత్రి రెండో నంబర్ ప్లాట్‌ఫాంలో తనిఖీలు నిర్వహించారు. మహారాష్ట్ర థానేకు చెందిన సిద్ధం గోవింద్ జాదవ్ (29) కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గురువారం ఉదయం వరంగల్ స్టేషన్‌లో దిగాడు. గురువారం సాయంత్రం నర్సాపురం- నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ కోసం వేచి ఉన్నాడు. భుజానికి బ్యాగుతో అనుమానాస్పదంగా కనిపించాడు. ప్రత్యేక బృందాలు రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో పోలీసులు అతడిని తనిఖీ చేయగా.. రూ.2.55 లక్షల విలువైన 10.2 కిలోల గంజాయిని గుర్తించారు. కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు జీఆర్పీ సీఐ తెలిపారు.

సెక్యూరిటీ గార్డుపై కత్తితో దాడికి యత్నం


దాడికి యత్నించిన సయ్యద్ షబ్బీర్

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో గురువారం రాత్రి సెక్యూరిటీ గార్డుపై ప్రసూతి మహిళా బంధువు కత్తితో దాడికి యత్నించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రంగశాయిపేటకు చెందిన సయ్యద్ షబ్బీర్(35) ఆసుపత్రిలో ప్రసూతి అయిన తన బంధువును చూసేందుకు గురువారం అర్ధరాత్రి రాగా సెక్యూరిటీ గార్డు అనుమతించలేదు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం కాగా, ఆవేశానికి లోనైన సయ్యద్ షబ్బీర్ తన వెంట తెచ్చుకున్న కత్తితో గార్డుపై దాడికి యత్నించాడు. గార్డు తప్పించుకొని అరవడంతో తోటి సిబ్బంది వచ్చిషబ్బీర్‌ను బంధించారు. అతని చేతిలోని కత్తిని స్వాధీనం చేసుకొని ఆసుపత్రిలో అవుట్ పోస్టు పోలీసులకు అప్పగించారు. అక్కడి పోలీసులు దాడికి పాల్పడిన వ్యక్తిని ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. దాడికి యత్నించిన వ్యక్తిపై ఫిర్యాదు చేయడానికి సీకేఎం ఆసుపత్రి సెక్యూరిటీ గార్డులు వెనుకాడుతున్నట్లు తెలిసింది. పోలీసులు మాత్రం దాడికి యత్నించిన షబ్బీర్‌ను విచారిస్తున్నట్లు తెలిపారు.

క్రెడిట్ కార్డు పేరుతో మోసం

పర్వతగిరి, న్యూస్‌టుడే: క్రెడిట్ కార్డు పేరుతో కేటుగాళ్లు ఓ యువకుడి బ్యాంకు ఖాతాల నుంచి రూ.14,162 కాజేసిన సంఘటం పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలో చోటుచేసుకుంది. ఈ నెల 24న క్రెడిట్ కార్డు ఇస్తామని ఆ యువకుడితో వాట్సాప్ ద్వారా సైబర్ నేరగాళ్లు పరిచయం చేసుకున్నారు. ఆధార్, పాన్ కార్డులను పంపిస్తే చరవాణికి లింకు పంపిస్తామని దానిని క్లిక్ చేస్తే యాప్ డౌన్‌లోడ్ అవుతుందని ఎలా ఇన్‌స్టాల్ చేసుకోవాలో చెప్తామని తెలిపారు. సదరు యువకుడు వాట్సాప్ ద్వారా వారికి ఆధార్, పాన్ కార్డులను పంపించాడు. వారు చెప్పిన విధంగా చరవాణిలో యాప్‌ను ఇన్స్టాల్ చేసుకున్న నిమిషం వ్యవధిలోనే యువకుడి బ్యాంకు ఖాతా నుంచి రూ.7,152, మరో బ్యాంకు ఖాతా నుంచి రూ.7,010 చొప్పున సైబర్ నేరగాళ్లు కాజేశారు. అప్రమత్తమైన యువకుడు వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1903కి కాల్ చేసి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' ఎస్సై ప్రవీణ్‌ను సంప్రదించగా ఫిర్యాదు అందినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

పాలకుర్తి, న్యూస్‌టుడే: వావిలాల శివారులో మూలమలుపు వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వస్తున్న ట్రాలీ ఆటో, కారు ప్రమాదవశాత్తు ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. ప్రమాదంలో వరంగల్‌కు చెందిన ఆటో డ్రైవర్ తిరుమలేష్, హైదరాబాద్‌కు చెందిన బ్రహ్మాజీ, సత్యవతి, మహాలక్ష్మి గాయపడ్డారు. గమనించిన స్థానికులు వారిని చికిత్స నిమిత్తం పాలకుర్తి వైద్యశాలకు తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించి బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సైలు పవన్‌కుమార్, లింగారెడ్డి వెంటనే స్పందించి, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు.

ధాన్యం బస్తాలు చోరీ

రాయపర్తి, న్యూస్‌టుడే : ధాన్యం బస్తాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన రాయపర్తి మండల కేంద్రం శివారులో గురువారం అర్ధరాత్రి జరిగింది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగుల సర్వయ్య (12 బస్తాలు), కసరబోయిన కుమార్ (20 బస్తాలు) ఇటీవల వరి పంట నూర్పిడి చేసి కొండూరుకు వెళ్లే రహదారిపై పెట్టారు. గురువారం సాయంత్రం గ్రామానికి చెందిన ఓ దళారికి విక్రయించగా కాంటాలు నిర్వహించారు. రాత్రి కావడంతో బస్తాలు అక్కడే భద్రపరిచి వెళ్లగా ఇరువురి రైతులకు చెందిన 32 బస్తాలను దుండగులు చోరీ చేశారు. సీసీ టీవీల ఆధారంగా దొంగలను గుర్తించి పట్టుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మట్టెవాడ: గుర్తు తెలియని మృతదేహం లభించినట్లు మట్టెవాడ ఠాణా పోలీసులు శుక్రవారం తెలిపారు. సీఐ తుమ్మ గోపీరెడ్డి కథనం మేరకు.. నగర పాలక సంస్థ ప్రాంగణంలోని మీసేవ కేంద్రం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి(51) మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించి భద్రపరిచారు.

ప్రసవం చేసేందుకు నిరాకరణ..!


వాహనంలో ప్రసవించిన నాగమణి

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి పురిటి నొప్పులతో బాధపడుతూ అర్ధరాత్రి వచ్చిన ఓ గర్భిణికి ప్రసవం చేయలేమని వరంగల్‌కు పంపడంతో మార్గం మధ్యలో 108 వాహనంలో ప్రసవించిన ఘటన చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన కిన్నెర నాగమణి అనే గర్భిణికి నెలలు నిండడంతో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత పురిటినొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు తొర్రూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడ వైద్య పరీక్షలు చేసిన సిబ్బంది ప్రసవం కోసం వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు నాగమణిని వర్ధన్నపేట ఆసుపత్రికి అర్ధరాత్రి 1.35 గంటల ప్రాంతంలో తీసుకొచ్చారు. వెంటనే ప్రసవం చేయాలని వైద్య సిబ్బందిని కోరారు. పరీక్షించిన సిబ్బంది కడుపులోని బిడ్డ పరిస్థితిని బాగా లేదని వైద్యులు శస్త్రచికిత్స చేయడానికి వైద్యులు లేరని తెలిపినట్లు ఆరోపించారు. కనీసం 108 వాహనానికి తెలపాలని కోరినా తమకు సంబంధం లేనట్లు వ్యహరించారన్నారు. అక్కడ ఉన్న ఇతరుల సాయంతో 108 వాహనంలో వరంగల్‌కు తరలిస్తుండగా పంథిని శివారులో ఆమెకు పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 వాహన టెక్నీషియన్ సదానందం నాగమణికి సాధారణ ప్రసవం చేయడంతో మగబిడ్డ జన్మించింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉండడంతో ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం తల్లిని బిడ్డను సీకేఎం ఆసుపత్రికి తరలించినట్లు బాధితులు తెలిపారు. ఈ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ రామ్మూర్తిని వివరణ కోరగా ఆసుపత్రిలో గురువారం రాత్రి ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పురిటి నొప్పులతో వచ్చిన నాగమణి కుటుంబ సభ్యులు ప్రసవం ముందు ఇచ్చే అనుపత్రి పత్రాలపై సంతకాలు చేయలేదని, అదే సమయంలో కడుపులో ఉమ్మనీరు తక్కువ ఉన్నట్లు సిబ్బంది గుర్తించారని తెలిపారు. ఘటనపై విచారణ చేస్తామని పేర్కొన్నారు.

చారిత్రక అంశాలపై అవగాహనకు తెలంగాణ దర్శిని

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: సాంస్కృతిక వారసత్వ ప్రాంతాలు, చారిత్రక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం తెలంగాణ దర్శిని కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా పాలనాధికారి డా.సత్యశారద తెలిపారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీల్లోని విద్యార్థులతో యువ టూరిజం క్లబ్బులను ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల వివరాలను ఈనెల 28 లోగా పర్యాటక శాఖ అధికారికి సమర్పించాలన్నారు. తెలంగాణ దర్శిని కార్యక్రమంలో భాగంగా క్లబ్బుల్లోని విద్యార్థులకు చారిత్రక, సాంస్కృతిక అంశాలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డీఈవో జ్ఞానేశ్వర్, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్డీవో కౌసల్యాదేవి తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం ప్రారంభం



ఖిలావరంగల్, న్యూస్‌టుడే: ఆయుర్వేద దినోత్సవంలో భాగంగా ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల, జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఖిలావరంగల్ పడమరకోట చమన్‌లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. 300 మంది రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయుర్వేద వైద్య విధానాలు, స్త్రీ సంబంధ వ్యాధులపై అవగాహన కల్పించారు. క్యాంప్ ఇన్‌ఛార్జి డాక్టర్ జగన్మోహనాచారి, సంస్థ జిల్లా అధ్యక్షులు కొన్రెడ్డి మల్లారెడ్డి, సదానందం, డాక్టర్ నాగలక్ష్మి, డాక్టర్ శ్రీదేవి, ఆయుష్ మిషన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రవణ్ పాల్గొన్నారు.

కురుమలకు దీపావళి పురస్కారాలు

రంగశాయిపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కురుమ కులస్థుల్లో ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్ వరకు వివిధ శాఖల్లో ఉద్యోగం సాధించిన వారికి దీపావళి పురస్కారాలు అందిస్తున్నట్లు కన్వీనర్లు మండల నర్సింహరాములు, ముదిగిరి ఓదేలు, అన్న రాజు తెలిపారు. అర్హులైన వారు ఈనెల 29 లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. 98665 65242, 94419 40568, 99667 14555 నంబర్లకు వివరాలు పంపాలని పేర్కొన్నారు.

ఆటవిడుపు కేంద్రం ప్రారంభం

కరీమాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్ తరహాలో వరంగల్‌లో పిల్లలు, యువతీ, యువకులు టీవీలు, ఫోన్‌లకు దూరంగా తల్లిదండ్రులతో ఆహ్లాదంగా గడిపేందుకు ఆటవిడుపు కేంద్రం ఏర్పాటైంది. వరంగల్ కరీమాబాద్ ఉర్సుగుట్ట ప్రాంతంలో యువ డాక్టర్లు ఏర్పాటు చేసిన సిమ్ అండ్ సామ్ కేంద్రాన్ని శుక్రవారం రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. మంత్రి సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి కొద్దిసేపు అందులో వాలీబాల్ ఆడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పల్లం పద్మ, పోశాల పద్మ, అనిల్‌కుమార్, నిర్వాహకులైన యువ వైద్యులు డాక్టర్ ప్రణీత్, డాక్టర్ అత్యున్, డాక్టర్ విక్రమ్, సింధు, డాక్టర్ సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

రంగశాయిపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అతిథి అధ్యాపకుల సంఘం అధ్యక్షులు డాక్టర్ పీ. రాజన్న కోరారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శుక్రవారం ప్రిన్సిపల్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎండీ.షరీఫ్‌పాష, కోశాధికారి గీత, సంయుక్త కార్యదర్శి షమీన ఉన్నారు.


రూ.26 వేల వేతనం ఖరారు చేయండి



సదస్సులో నాయకుల అభివాదం

రామన్నపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించబోయే పీఆర్సీలో మున్సిపల్ కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఖరారు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఒప్పంద ఉద్యోగ, కార్మికులకు డీఏలు వర్తింపజేయాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జలీల్ సాహెబ్ డిమాండ్ చేశారు. శుక్రవారం వరంగల్ పోతన ఆడిటోరియంలో వరంగల్ ఉమ్మడి జిల్లా మున్సిపల్ ఒప్పంద ఉద్యోగ, కార్మికుల సదస్సు జిల్లా అధ్యక్షుడు పాశం రవి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జలీల్ సాహెబ్ మాట్లాడుతూ మున్సిపల్ ఒప్పంద ఉద్యోగ, కార్మికులను క్రమబద్ధీకరించాలని, పదవి విరమణ చేసే వారికి రూ.5లక్షలు చెల్లించాలని, శానిటరీ జవాన్లు, స్కిల్ వర్కర్లకు వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఓంకార్ వర్ధంతి


నివాళులర్పిస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

దుగ్గొండి, న్యూస్‌టుడే: అడవిరంగాపురం గ్రామ కూడలిలో ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దివంగత ఓంకార్ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఓంకార్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర నాయకులు బాబురావు, డివిజన్ కార్యదర్శి రాజాసాహెబ్, మండల కార్యదర్శి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.


నర్సంపేట గ్రామీణం: బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాటాలు చేసిన నర్సంపేట దివంగత మాజీ ఎమ్మెల్యే ఓంకార్ చేసిన పోరాటాలు మరవలేనివని ఎంసీపీఐయు డివిజన్ సహాయ కార్యదర్శి రాజమౌళి అన్నారు. శుక్రవారం నర్సంపేట మండలం మాదన్నపేటలో ఓంకార్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు సదానందం, రమేష్, సాంబయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట నియోజకవర్గం

వసతి గృహాలకు దుప్పట్లు పంపిణీ చేయాలి

నర్సంపేట,న్యూస్‌టుడే: ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లోని పేద విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేయాలని ఏబీఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, స్వేరో సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. 'వసతి గృహం..చలికాలంలో కష్టం' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనం నేపథ్యంలో శుక్రవారం నర్సంపేటలోని ఎస్సీ సహాయ సంక్షేమాధికారికి విద్యార్థి సంఘాల బాధ్యులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నరేష్, రాజేందర్, రాజేంద్రప్రసాద్, వినయ్, ప్రశాంత్, రాజ్‌కుమార్, ప్రసాద్, రాజేష్ పాల్గొన్నారు.

నేవీ అగ్నివీర్‌కు సైనిక్‌స్కూల్ విద్యార్థి ఎంపిక


ఆర్.కిషోర్

ఖానాపురం,న్యూస్‌టుడే: మండలంలోని అశోక్‌నగర్ సైనిక్ స్కూల్‌లో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆర్.కిషోర్ నేవీ అగ్నివీర్ ఉద్యోగానికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సురేందర్, డైరెక్టర్ శ్రీనివాస్‌స్వామి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 7న ఉద్యోగంలో చేరనున్నట్లు పేర్కొన్నారు. కిషోర్‌ను అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

'పదేళ్లు మోసం చేసిన భారాస'

నర్సంపేట, న్యూస్‌టుడే: పదేళ్ల పాలనలో ప్రజలను మోసం చేసిన భారాస నేతలు ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం జిల్లా ఛైర్మన్ తిరుపతి అన్నారు. శుక్రవారం నర్సంపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఉద్యమకారుల ఆకాంక్షలకు వ్యతిరేకంగా నియంతపాలన కొనసాగించారని పేర్కొన్నారు. అధికారం కోల్పోయి మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

నియామకాల్లో అన్యాయం

నల్లబెల్లి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి వైఖరితో ఉద్యోగ నియామకాల్లో దళితులకు అన్యాయం జరుగుతోందని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రణయ్‌దీప్ అన్నారు. శుక్రవారం నల్లబెల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు వెలువరించినా రాష్ట్రంలో వర్గీకరణ అమలు చేయకపోవడం దారుణమన్నారు. బొట్ల నరేశ్, అరుణ్, శ్యామ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పంబాల కళాకారుల సంఘం అధ్యక్షుడిగా హరికృష్ణ

దుగ్గొండి, న్యూస్‌టుడే: పంబాల కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మందపల్లి గ్రామానికి చెందిన హరికృష్ణ ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శిగా రాజయ్య ఎన్నికయ్యారు.

తాగు నీటి సరఫరాకు ఇబ్బంది రానీయొద్దు

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగు నీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండ చూడాలని మిషన్ భగీరథ ఈఈ వెంకటరమణారెడ్డి అన్నారు. పంచాయతీ, భగీరథ సిబ్బందికి ఇక్కడ జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. చేతిపంపు మరమ్మతులపై మెకానిక్‌లు, గ్రామ సహాయకులకు శిక్షణ ఇచ్చారు. డీఈఈ దేవేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీధర్‌రాజ్, మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ ఏఈఈలు రణధీర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతకు నేతాజీ జాతీయ పురస్కారం


కానిస్టేబుల్ రాజును సత్కరిస్తున్న నిర్వాహకులు

ఖానాపురం,న్యూస్‌టుడే: ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి 33 సార్లు రక్తదానం చేసిన ఖానాపురం మండలం రాగంపేటకు చెందిన కానిస్టేబుల్ కన్నె రాజుకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హెల్ప్ ఫౌండేషన్ సంస్థ 'నేతాజీ సుభాష్ చంద్రబోస్ జాతీయ పురస్కారం- 2024'ను శుక్రవారం అందజేశారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి పురస్కారం అందజేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు కంచర్ల బుల్లిబాబు పేర్కొన్నారు.

మూఢ నమ్మకాలపై అవగాహన

కీర్తినగర్‌కాలనీ(గీసుకొండ), న్యూస్‌టుడే: సాంకేతిక కాలంలో మూఢ నమ్మకాలను ప్రజలు వీడాలని తహసీల్దార్ ఎండీ. రియాజుద్దీన్ తెలిపారు. మండలంలోని మొగిలిచెర్ల గ్రామంలో మూడు నెలల కాలంలో వివిధ కారణాలతో సుమారు 45 మంది చనిపోయారు. కీడు సోకిందని గ్రామస్థులంతా మూకుమ్మడిగా బుధవారం వనభోజనాలకు వెళ్లారు. విషయం జిల్లాపాలనాధికారి సత్యశారద దృష్టికి వెళ్లింది. శుక్రవారం ఆమె ఆదేశాల మేరకు తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీవో కృష్ణవేణి, ఇతర అధికారులు గ్రామాన్ని సందర్శించి ప్రజలకు మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు.